




మాడుగుల సభలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న లోకేశ్, పీవీజీ కుమార్, సత్యవతి

ఉత్తరాంధ్రను దోచుకుంటున్న వైసీపీ నేతలు

బొత్స, విజయసాయి, వైవీలు ఈ ప్రాంతాన్ని మింగేస్తున్నారు

- టీడీపీ యువనేత నారా లోకేశ్ ధ్వజం
- విశాఖ ఉక్కుప్రైవేటీకరణకు వైసీపీ ప్రోత్సాహం
- టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- జగన్ పాదయాత్రలో ఉమ్మడి జిల్లాలో 50కిపైగా హామీలు.. సీఎం అయిన తరువాత ఒక్కటీ అమలు చేయలేదు
- మూడు షుగర్ ఫ్యాక్టరీలను మూసేయించారు
- కొత్త పరిశ్రమలు ఒక్కటీ రాలేదు
- కోడిగుడ్డు మంత్రి దెబ్బకు ఉన్న పరిశ్రమలు పారిపోతున్నాయి
- టీడీపీ హయాంలో 'నర్సీపట్నం'లో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు
- టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం
- నర్సీపట్నం శంఖారావం సభలో లోకేశ్





నర్సీపట్నం సభలో ప్రతిజ్ఞ చేస్తున్న నారా లోకేశ్, సీహెచ్ అయ్యన్నపాత్రుడు, బుద్ద నాగజగదీశ్వరరావు, పంచకర్ల రమేశ్‌బాబు, వేపాడ చిరంజీవిరావు, చింతకాయల విజయ్, రాజేశ్, రాజాన సూర్యచంద్ర

నర్సీపట్నం, ఫిబ్రవరి 20: ఉత్తరాంధ్రను దోచుకునేందుకు వైసీపీ ప్రభుత్వం ముగ్గురికి లైసెన్స్ ఇచ్చిందని, బొత్స సత్యనారాయణ, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి పందికొక్కుల్లా తింటున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. మంగళవారం మధ్యాహ్నం నర్సీపట్నంలోని బలిఘట్టంలో ఏర్పాటు చేసిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వైసీపీ పాలకులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ... మిగతా 8వ పేజీలో

మాడుగులలో ప్రకృతి సంపద దోపిడీ

గ్రానైట్ క్వారీల నుంచి నెలకు రూ.కోటి చొప్పున డిప్యూటీ సీఎంకు మామూళ్లు

- ముడుపులు ఇస్తేనే ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులు
- సీసీ రోడ్లు వేయలేదు.. గోతులు పూడ్చలేదు
- మంత్రి 'బూడి'పై టీడీపీ నేత లోకేశ్ ఆరోపణలు

మాడుగుల/ మాడుగుల రూరల్, ఫిబ్రవరి 20 : "మాడుగుల నియోజకవర్గంలో ఇసుక, ఖనిజం సహా ప్రకృతి వనరులన్నీ దోచుకోవడమే ఆయన పని. రోడ్ల నిర్మాణ పనులను తన సొంత కంపెనీ ద్వారానే చేయిస్తారు. స్థానికంగా ఉన్న క్వారీల యజమానులు నెలకు కోటి రూపాయలను ఆయనకు సమర్పించుకోవాల్సిందే. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ఆయన.. ఈ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి నిల్.. అవినీతి మాత్రం ఫుల్" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం ఉదయం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో నిర్వహించిన ... మిగతా 8వ పేజీలో

పేట టీడీపీకి కంచుకోట

- వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి
- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత తీసుకుంటా
- కోటవురట్ల 'శంఖారావం' సభలో నారా లోకేశ్
- రాజాం చెత్త.. 'పేటలో పసిడి అవుతుందా? అని జోగులును ఉద్దేశించి విమర్శ



కోటవురట్ల సభలో లోకేశ్‌కు నాగలి బహూకరిస్తున్న రైతు. పక్కన గెడ్డం బుజ్జి, వంగలపూడి అనిత

కోటవురట్ల, ఫిబ్రవరి 20: తెలుగుదేశం పార్టీకి పాయకరావుపేట నియోజకవర్గం కంచుకోటని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని అధిక మెజారిటీ గెలిపించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఇక్కడ నిర్వహించిన 'శంఖారావం' సభలో ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, వైసీపీ ప్రభుత్వం మూసివేసిన సహకార షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి చెరకు రైతులు, కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లా రాజాం నుంచి చెత్తను తీసుకువచ్చి పాయకరావుపేటలో పెడితే పసిడి అవుతుందా? ఈ నియోజకవర్గంలో ఏ ప్రాజెక్టు ఎక్కడో ఉందో ... మిగతా 8వ పేజీలో



కోటవురట్లలో శంఖారావం సభకు హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు

కోటవురట్ల సభలో మాట్లాడుతున్న నారా లోకేశ్

మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు వద్ద నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన టీడీపీ శ్రేణులు

గిరిజన బాలలకు సేవ చేసే తీరు ఇదేనా?

- గిరిజన సంక్షేమ విద్యాశాఖ సమీక్షలో ఐటీడీఏ పీవో అభిషేక్ సూటిప్రశ్న
- విద్యార్థుల ఆరోగ్య బాధ్యత హెచ్‌ఎంలదేనని స్పష్టీకరణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన టీడబ్ల్యూ డీడీ కొండలరావు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన బాలలకు సేవ చేసే తీరు ఇదేనా? అంటూ గిరిజన సంక్షేమ శాఖాధికారులు, హెచ్‌ఎంలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, డిప్యూటీ వార్డెన్లను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూటిగా ప్రశ్నించారు. ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. ఆశ్రమ పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, ఇటీవల జరుగుతున్న విద్యార్థుల మరణాలపై మండలాలవారీగా ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు మరణిస్తే సంబంధిత ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేసి ప్రభుత్వానికి సరెండరు చేస్తామని ఐటీడీఏ పీవో హెచ్చరించారు. విద్యార్థుల మరణాలపై టీడబ్ల్యూ డీడీకి వెంటనే సమాచారం అందించాలని, గిరిజన విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా పనిచేయాలన్నారు. స్థానిక ఆస్పత్రిలో గిరి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక వార్డు ఏర్పాటు చేయాలని ఆస్పత్రి అధికారులను ఆదేశించామన్నారు. విద్యార్థుల చర్మ వ్యాధుల నివారణకు రూ.5.5 లక్షల వ్యయంతో సబ్బులు పంపిణీ చేశామని, ఆశ్రమ పాఠశాలలు సందర్శించినప్పుడు సమస్యలను తన దృష్టికి తీసుకురావడం లేదన్నారు. తమకు కావాల్సిన వాళ్లను డిప్యూటీ వార్డెన్‌గా నియమించండని ఎక్కువ మంది హెచ్‌ఎంలు సిఫారసులు చేస్తున్నారని, అటువంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి ఆదేశాలను ఉపాధ్యాయులు విధిగా పాటించాలని, ఎవరైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తన దృష్టికి తీసుకుని వస్తే వారిపై చర్యలు చేపడతామన్నారు. డిప్యూటీ వార్డెన్ పోస్టుపై ఉన్న ఉత్సాహం పిల్లల ఆరోగ్యంపై లేదని ఐటీడీఏ పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ ... మిగతా 8వ పేజీలో

జి.మాడుగుల @8.8

- కొనసాగుతున్న చలి తీవ్రత



లంబసింగిలో మంచు

పాడేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి తీవ్రత కొనసాగుతోంది. జి.మాడుగులలో 8.8, అరకులోయలో 10.6, పాడేరులో 10.7, పెదబయలు, ముంచంగిపుట్టులో 11.9, డుంబ్రిగుడలో 13.0 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదయ్యాయి. దీంతో మన్యంలోని కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా పొగమంచు కురుస్తున్నది.

చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరిగింది. మంగళవారం చింతపల్లిలో 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. అయితే పగటి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపించింది. ప్రస్తుతం 32 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతున్నది. మంచు ఉదయం ఎనిమిది గంటల వరకు కురుస్తున్నది.

మిలాన్ మెరుపులు

ఆర్‌కే బీచ్ రోడ్డులో రెండు వేల మందితో ఫుల్ డ్రెస్ రిహార్సల్

- ఇంటర్నేషనల్ సిటీ పరేడ్...పాల్గొన్న 50 దేశాల ప్రతినిధులు
- యుద్ధ విమానాల విన్యాసాలతో దద్దరిల్లిన గగనతలం



జాతీయ పతాకం రంగులు ఆవిష్కరించేలా సముద్రంలో బాంబులు పేల్చిన దృశ్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'మిలాన్' మెరుపులతో ఆర్‌కే బీచ్ అదిరిపోయింది. యుద్ధ విమానాల విన్యాసాలతో ఆకాశం దద్దరిల్లిపోయింది. నేవీ బృందాల సంగీతంతో, సైనిక విద్యార్థుల నృత్యాలతో సాగరతీరం పులకించిపోయింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన నౌకా దళాలతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ (అంతర్జాతీయ నగర కవాతు) ఫుల్ డ్రస్ రిహార్సల్ అబ్బురపరచింది. భారత వైమానిక దళం శక్తి సామర్థ్యాల ప్రదర్శన హైలైట్‌గా నిలిచింది. ఈ కార్యక్రమానికి తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ అతిథిగా విచ్చేశారు.

ఆర్కే బీచ్‌రోడ్డులో సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు 100 నిమిషాలు నిరాటంకంగా కొనసాగాయి. మిత్రదేశాలతో అంతర్జాతీయ అవగాహన, విశ్వజనీన స్నేహభావన పెంపొందించేలా సాగిన కవాతు ఆద్యంతం ఆకట్టుకుంది. వైమానిక దళంలో ఉన్న సీ కింగ్ హెలికాప్టర్లు, సీ హాక్‌లు, చేతక్‌లు, డార్నియర్లు, జెట్ ఫైటర్లు, పూర్తిగా స్వదేశీ ... మిగతా 7వ పేజీలో



ప్రదర్శనలో తేజస్ యుద్ధ విమానం

జనాన్ని తెండి...

సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులకు టార్గెట్లు

- నేడు విశాఖ శారదా పీఠానికి రానున్న ముఖ్యమంత్రి
- విమానాశ్రయం నుంచి పీఠానికి వెళ్లే మార్గంలో పాయింట్‌కు 500 మంది ఉండాలని లక్ష్యం
- ఆర్‌పీలు, వలంటీర్లకు బాధ్యతలు
- జోనల్ కమిషనర్ల పర్యవేక్షణ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన అంటే విశాఖలో అధికారులతో పాటు ప్రజలు కూడా బెంబేలెత్తిపోతున్నారు. ఆయన వచ్చిన ప్రతిసారీ జన సమీకరణ చేయాలని ఆదేశిస్తున్నారు. దీంతో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. తాజాగా చినముషిడివాడలోని శారదాపీఠంలో రాజశ్యామల పూజలో పాల్గొనడానికి సీఎం బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. విజయవాడ నుంచి బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి ఉదయం 11.20 గంటలకు చేరుకుంటారు. అక్కడ ... మిగతా 8వ పేజీలో

ఏవోబీలో మావోయిస్టుల కదలికలు

- మారుమూల గ్రామాల్లో సంచరించినట్టు గుర్తించిన పోలీసులు
- గాలింపు ముమ్మరం

కొయ్యూరు, ఫిబ్రవరి 20: ఐదేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఏవోబీలో మావోయిస్టులు సంచరించినట్టు పోలీసులు గుర్తించారు. మారుమూల కొండలపై గల గ్రామాల్లో పర్యటించినట్టు సమాచారం రావడంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. దీంతో మన్యంలో మళ్లీ అలజడి మొదలైంది.

ఇటీవల ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాలతో పాటు మండలంలో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలుగా ముద్రపడిన కొండలపై గల అత్యంత మారుమూల గ్రామాల్లో మావోయిస్టుల కదలికలు పెరిగినట్టు పోలీసులు గుర్తించారు. గత డిసెంబరు చివరి వారం నుంచి జనవరి మూడవ వారం ... మిగతా 8వ పేజీలో



కోటవురట్ల సభకు అధిక సంఖ్యలో హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నర్సీపట్నం సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

అదే జోరు.. కేడర్‌లో హుషారు

- శంఖారావం సభలకు పోటెత్తిన టీడీపీ శ్రేణులు
- లోకేశ్ ప్రసంగాలకు విశేష స్పందన

అనకాపల్లి జిల్లాలో మంగళవారం మూడు చోట్ల శంఖారావం సభలు విజయవంతంగా జరిగాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రసంగాలకు విశేష స్పందన లభించింది. మాడుగుల మండలం సురవరం వద్ద, నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టంలో, కోటవురట్లలో నిర్వహించిన శంఖారావం సభలు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. వైసీపీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలను లోకేశ్ ఎండగట్టారు. పాలకుల అవినీతిపై ధ్వజమెత్తారు.



మాడుగులలో లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీవీజీ కుమార్ సతీమణి



మాడుగులలో కార్యకర్తల ఉత్సాహం



లోకేశ్‌కు పూల గద బహూకరిస్తున్న దృశ్యం



కోటవురట్ల సభలో లోకేశ్‌కు అల్లూరి సీతారామరాజు చిత్రపటం బహూకరిస్తున్న పీవీవీఎస్ఎన్ రాజు



మాడుగులలో లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న అభిమానులు



నర్సీపట్నంలో లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరికలు



మాడుగులలో దివ్యాంగ వృద్ధుని సమస్యలు ఆలకిస్తున్న లోకేశ్



నర్సీపట్నం సభలో చిరునవ్వులు చిందిస్తున్న లోకేశ్, అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం సభలో చప్పట్లు కొడుతూ సందడి చేస్తున్న మహిళలు



వెంకన్న చిత్రపటాన్ని అందజేస్తున్న గవిరెడ్డి రామానాయుడు

క్రైం... crime news

కల్వర్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

ఎలమంచిలి, ఫిబ్రవరి 20: మునిసిపాలిటీ పరిధిలోని పెంజెరువు సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపిన సమాచారం ప్రకారం.. మునిసిపాలిటీలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఈరుగుల ప్రసాద్ (27) ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం సాయంత్రం ఎస్.రాయవరం వెళ్లాడు. రాత్రి 9.30 గంటల సమయంలో తిరిగి ఎలమంచిలి వస్తుండగా పెంజెరువు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్నది. దీంతో ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. రహదారిపై వెళుతున్న వారు 108కు ఫోన్ చేయడంతో అంబులెన్స్‌లో సీహెచ్‌సీకి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఇతని తండ్రి చంద్రరావు మునిసిపాలిటీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్నారు. అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

120 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్టు

రోలుగుంట, ఫిబ్రవరి 20: మండలంలోని అర్ల- రత్నంపేట మధ్య మంగళవారం తెల్లవారుజామున 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ అప్పలనాయుడు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడానికి ప్యాకెట్ల రూపంలో గంజాయిని అర్ల- రత్నంపేట మధ్య దాచిపెట్టినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు నిఘా పెట్టారు. గంజాయిని ఆటోలో ఎక్కిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధం ఉన్న అర్ల గ్రామానికి చెందిన బాణం ధర్మరాజు, రత్నంపేట గ్రామానికి చెందిన బోడెపు గంగన్న, చోలపాటి సోమునాయుడు, బీబీపట్నం గ్రామానికి చెందిన బియ్యాల అప్పలనాయుడులను అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. బియ్యాల అప్పలనాయుడుపై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నాయని, పీడీ యాక్టు కూడా నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

జెడ్పీలో ఏడుగురికి పదోన్నతులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20: జిల్లా పరిషత్‌లో ఏడుగురు ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. ఆఫీస్ సబార్డినేట్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఏడుగురికి రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	123.00
లైవ్ ధర	143.00
విత్ స్కిన్	256.00
స్కిన్ లెస్	266.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

టీడీపీలో భారీగా చేరికలు

- లోకేశ్ సమక్షంలో చేరిన 350 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు

మాడుగుల, ఫిబ్రవరి 20: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో మూడు పంచాయతీలకు చెందిన 350 మంది వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం ఘాటీరోడ్డు-సురవరం గ్రామాల మధ్య మంగళవారం జరిగిన శంఖారావం సభకు లోకేశ్ హాజరై ప్రసంగించారు.

అనంతరం మండలంలోని జాలంపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, ప్రస్తుత యాదవ సంఘం మండలాధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పల్లా భీమేశ్వరమ్మ (మాజీ సర్పంచ్), లంకెల దేముడు (కింతలి మాజీ కో-ఆపరేటివ్ డైరెక్టర్), మాడుగుల లక్ష్మణ్‌రావు (మాజీ ఉప సర్పంచ్), బచ్చల వరలక్ష్మితో సహా 42 కుటుంబాలకు చెందిన 250 మంది ఆ గ్రామ టీడీపీ నాయకులు బానం బీమలింగేశ్వర్రావు, చంటి, చిన్న, గోవింద, చిన్నారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

అలాగే ఎల్ పొన్నవోలు పంచాయతీ నుంచి చామంతులు అర్జునరావు (వైసీపీ యూత్ అధ్యక్షుడు), మాజీ వార్డు మెంబర్లు గట్టెం బుల్లమ్మ, వంతాల చిన్నమ్మలు, సాగాని దేముడమ్మతో సహా 97 మంది ఆ పంచాయతీ టీడీపీ నాయకులు యన్నంశెట్టి సత్యారావు, సంతోష్, పవన్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. అలాగే అవురివాడ పంచాయతీ నుంచి ముగ్గురు కూడా పార్టీలో చేరారు.

మొత్తం 350 మంది వైసీపీకి చెందిన నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో నారా లోకేశ్ చేతుల మీదుగా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వైసీపీలో కష్టపడి పనిచేసినప్పటికీ సరైన గుర్తింపు లేదని, ప్రస్తుత ప్రభుత్వం విధి విధానాలు బాగోలేనందున పార్టీని వీడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మాజీ సర్పంచ్ పల్లా శ్రీను, భీమేశ్వరమ్మలు తెలిపారు.



జాలంపల్లి మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు పల్లా శ్రీనివాసుకి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్



జాలంపల్లి మాజీ సర్పంచ్ పల్లా భీమేశ్వరమ్మకి పార్టీ కండువా వేస్తున్న దృశ్యం

శాస్త్రవేత్తల బృందం రబీ పంటలు పరిశీలన

- తెగుళ్ల నివారణకు పలు సూచనలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 20: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు గ్రామాల్లో మంగళవారం శాస్త్రవేత్తలు పర్యటించి రబీ పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు కేవీ రమణమూర్తి, వి.చంద్రశేఖర్, కొక్కిరాపల్లి నువ్వు పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఏబీఎం శిరీష, డీఆర్‌సీ అధికారి తులసి, వ్యవసాయ శాఖ డీడీ రవి ప్రకాశ్ బృందం ఎలమంచిలి, కొత్తపాలెం, రాంబిల్లి మండలం మామిడివాడ, అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట, పెదపాడు గ్రామాల్లో పెసర, మినుము, జనుము, చెరకు పంటలను పరిశీలించారు. పెసర, మినుము పంటలను బూడిద తెగులు ఆశించినట్టు గుర్తించారు. దీని నివారణకు గంధకం పొడి లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండిజం మందును లీటరు నీటికి 1.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. చిత్తపురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటికి 1.6 మి.లీ.ల చొప్పున కలిపి పిచికారి చేయాని సూచించారు. చెరకులో వడల తెగులు లక్షణాలు కనిపిస్తే అటువంటి ఆకులు పీకివేసి కాల్చివేయాలన్నారు. చెరకులో వలయాకారపు మచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ మందును లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేసుకోవాలని చెప్పారు. వీరి వెంట ఏఓలు మోహన్‌రావు, శంకర్ గోవింద్, సుమంత, సిబ్బంది దేవుడు, సంతోషి, ప్రవీణ, నీరజ వున్నారు.



కొత్తపాలెంలో పెసర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

వైసీపీ పాలనలో షుగర్ ఫ్యాక్టరీలు మూత

- ఆధునికీకరణ హామీని విస్మరించిన జగన్‌రెడ్డి
- 'శంఖారావం' సభలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు ధ్వజం



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఫిబ్రవరి 20: ప్రతిపక్షంలో వున్నప్పుడు పాదయాత్ర చేసిన జగన్‌రెడ్డి.. అధికారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరిస్తామని చెప్పారని, కానీ సీఎం అయిన తరువాత తాండవ, ఏటికొప్పాక, తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీలను మూసివేయించారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సీహెచ్ అయ్యన్నపాత్రుడు విమర్శించారు. బలిఘట్టంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ, తమ హయాంలో నర్సీపట్నంలో 2,500 టిడ్కో ఇళ్లు నిర్మిస్తే, ఇంతవరకు వాటిని లబ్ధిదారులకు ఇవ్వలేదని చెప్పారు. గ్రామస్థాయిలో పశువైద్య సేవలు అందించేందుకు తాము గోపాల మిత్రలను నియమించగా, వైసీపీ ప్రభుత్వం వారిని తొలగించిందని, దీంతో గ్రామస్థాయిలో పశువులకు వైద్య సేవలు అందడంలేదని చెప్పారు. తాండవ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయలేని హీనస్థితిలో ఈ ప్రభుత్వం వుందని ఆరోపించారు. తాండవ రిజర్వాయర్‌లోకి నీరు వచ్చే ఎగువ ప్రాంతాన్ని హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం తన బంధువుకు చెందిన షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి కట్టబెట్టారని, దీనివల్ల తాండవ ఆయకట్టుకు నీరు అందక రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని వలంటీర్లు దుష్ప్రచారం చేస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఇంతకన్నా మెరుగైన పథకాలను అందిస్తామని అయ్యన్న చెప్పారు. రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఓట్లు వేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

లంకెలపాలెం, ఫిబ్రవరి 20: చేసిన అప్పులు తీర్చే దారి లేకపోవడంతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్‌నాయక్ (21) లంకెలపాలెంలోని ఒక లాడ్జిలో పనిచేస్తున్నాడు. ఇతని పెదనాన్న కొడుకు అతిశ్‌కుమార్‌తో కలిసి లాడ్జినే ఒక గదిలో ఉంటున్నారు. మంగళవారం ఉదయం అతిశ్‌కుమార్ బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత తిరిగి రూమ్‌కు వచ్చాడు. ప్రశాంత్ ఫ్యాన్‌కు టవల్‌తో ఉరివేసుకుని కనిపించాడు. దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. అతిశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిలాన్ మెరుపులు

... 5వ పేజీ తరువాయి

పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానాలు, భూమిపై, సముద్రంపై పనిచేయగల యుహెచ్3హెచ్ హెలికాప్టర్లు, మిగ్ 29కే విమానాలు వాటి శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాయి. 'ఫ్లై పాస్ట్' పేరుతో 60 యుద్ధ విమానాలు వరుస క్రమంలో చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. మెరైన్ కమెండోల సాహస ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, మలేషియా, వియత్నాం, రష్యా, ఫ్రాన్స్ ఇరాన్, మారిషస్ దేశాల నేవీ దళాలు, సీ కాడెట్లు, ఏపీ పోలీస్, ఎన్‌సీసీ, కోరుకొండ సైనిక్ స్కూల్, నేవీ చిల్డ్రన్ స్కూల్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ కోస్టుగార్డ్ బృందాలు కవాతు నిర్వహించాయి. నేవీ స్కూల్ విద్యార్థులు వివిధ రంగులతో భావావేశాలను ప్రదర్శించే నృత్యరూపకం కరతాళ ధ్వనులు అందుకుంది. యుద్ధ విమాన వాహక నౌకలు విక్రాంత్, విక్రమాదిత్యలు గంభీరంగా సముద్రంలో నిల్చొని భారత నౌకదళం శక్తిని ప్రతిబింబించాయి.

వివిధ ప్రాంతాల్లో రెండో రోజు

మిలాన్ రెండో రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం ఆరోగ్య నడక, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. డాల్ఫిన్ కొండపై 600 మందికి పైగా ట్రెక్కింగ్ చేశారు. యారాడ బీచ్‌లో యోగా నిర్వహించారు. యాభై దేశాల నుంచి వచ్చిన యువ నేవీ ఆఫీసర్లు అనుభవాలను పంచుకున్నారు. వీరంతా కలిసి ఐఎన్ఎస్ తరంగిణి నౌకపై సెయిలింగ్ చేశారు. హిందుస్థాన్ షిప్‌యార్డులో డీప్ సబ్‌మెర్జెన్ రెస్క్యూ వెహికల్ ద్వారా సబ్‌మెరైన్లను రక్షించే విధానం చూపించారు.



హెలికాప్టర్ల పైనుంచి సముద్రంలోకి దిగుతున్న కమాండో



కలెక్టర్ విజయసునీత కుటుంబీకులను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

మత్స్యలింగేశ్వరస్వామిని దర్శించుకున్న నూతన కలెక్టర్ విజయసునీత

హుకుంపేట, ఫిబ్రవరి 20: మండలంలోని మఠం పంచాయతీలో గిరిజనుల ఆరాధ్య దైవం మత్స్యలింగేశ్వర స్వామిని జిల్లా నూతన కలెక్టర్ విజయసునీత కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. అక్కడ వాతావరణం చూసి సంతోషం వ్యక్తం చేశారు. దేవాలయ చరిత్ర గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ కుటుంబీకులను కమిటీ సత్కరించింది. వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ విజయసునీత కమిటీ ప్రతినిధులకు సూచించారు. అలాగే ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని, ఇందుకోసం తమ సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాంతి కుమారి, ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, గోపాల పాత్రుడు, మత్స్యకొండబాబు, సంహాచలంనాయుడు, రాంబాబు, బీమ్‌నాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులపై ధ్వజం

- అసంపూర్తిగా పథకాలు.. నాణ్యతకు తిలోదకాలు
- రోజుల వ్యవధిలోనే పథకాలకు మరమ్మతులు
- వేసవికి ముందే తాగునీటికి ఆదివాసీల అవస్థలు
- మండల సమావేశంలో అధికారులపై సభ్యుల అసహనం



మండల సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 20: జల్ జీవన్ మిషన్ పనులపై సభ్యులు ధ్వజమెత్తారు. గ్రామాల్లో పథకాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని, వేసవికి ముందే ఆదివాసీలు తాగునీటికి అవస్థలు పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. అనంతరం పెదవలస సర్పంచ్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కోసం ఆదివాసీలు అవస్థలు పడుతున్నప్పటికీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో చేతి పంపులు మరమ్మతులకు గుయ్యాయని, జల్ జీవన్ మిషన్ పథకాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయని చెప్పారు. ఇంటింటికీ కొళాయి వేస్తామని చెప్పిన అధికారులు, నేటి వరకు పనులు పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. దీనిపై అధికారులను ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు ఎ.బుజ్జిబాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కేవలం రోజుల వ్యవధిలోనే మరమ్మతులకు గురవుతున్నాయనారు. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతున్నదన్నారు. జేజేఎం పనులపై తక్షణమే ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసే నాణ్యత ప్రమాణాలపై విచారణ చేయాలని, బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ భగవంతరావు స్పందిస్తూ జల్ జీవన్ మిషన్ పథకం నిధులు కొరత కారణంగా కొంత పనుల్లో జాప్యం జరుగుతున్నదని, పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మంచినీటి పథకాల క్లోరినేషన్ చేయాల్సిన బాధ్యత కార్యదర్శులదేనన్నారు. వారు స్పందించకపోతే తనకు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కోఆప్టెడ్ సభ్యుడు దావీదు మాట్లాడుతూ తాజాగా మంజూరైన రూ.48 లక్షల మండల పరిషత్ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ నిధుల ఖర్చు వివరాలు సభ్యులకు తెలియజేయాలని పట్టుబడ్డారు. దీనికి ఎంపీడీవో సమాధానమిస్తూ మండల పరిషత్ నిధులు ఖర్చు చేసేందుకు సభ్యుల నుంచి ప్రతిపాదనలు కోరామని, నిధులు ఖర్చు కాలేదని తెలిపారు. అలాగే ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించడంలేదని, కేవలం కార్యాలయానికే పరిమితమవుతున్నారని సభ్యులు ఆరోపించారు. దీంతో గ్రామాల్లో బాలబాలికలకు కేంద్రాల నుంచి పూర్తి స్థాయిలో పోషకాహారం అందడంలేదన్నారు. గతంలో గ్రిడ్ విద్యుత్ సదుపాయంలేకి గ్రామాల్లో నిర్మించిన సోలార్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన విలువైన బ్యాటరీలు దొంగలు పట్టుకుపోతున్నారని, సోలార్ ప్లాంట్ల తాజా పరిస్థితిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కొంత మంది సభ్యులు డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్ల వద్ద బ్యాటరీలు, సోలార్ ప్లేట్‌లపై విచారణ చేపడతామని ఈపీడీసీఎల్ ఏఈఈ వి.ప్రభాకరరావు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, వైస్ ఎంపీపీలు సప్పగెడ్డ ఆనంద్, దేముడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం'

చింతపల్లి, ఫిబ్రవరి 20: 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడి చేయడం అమానుషమని టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అన్నారు. జగన్‌కు ఓటమి భయం పట్టిందని, దీంతో వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చే పత్రికలు, ప్రతిపక్షాన్ని టార్గెట్ చేశారని చెప్పారు. రాజకీయంగా ఎదుర్కోలేక పార్టీ క్యాడర్‌ను దాడులకు ప్రోత్సహిస్తున్నారన్నారు. అధికార మదంతో విర్రవీగుతున్న జగన్‌కు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. అతని వెంట నాయకులు ఆర్.ఆనంద్, ఎల్.నాగభూషణం ఉన్నారు.

మాడుగులలో ప్రకృతి సంపద దోపిడీ

... 5వ పేజీ తరువాయి

'శంఖారావం' సభలో లోకేశ్ మాట్లాడుతూ, గత ఐదేళ్లలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయించలేదని, రోడ్లపై ఏర్పడిన గోతులను కూడా పూడ్చలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ ఉచిత కొళాయి పథకం కింద నిధులు ఇస్తుంటే.. మంత్రి తన వాటాల కోసం ప్రాజెక్టును నీరుగారుస్తున్నారని లోకేశ్ ఆరోపించారు. పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు, పోస్టింగుల కోసం మంత్రికి ముడుపులు సమర్పించుకోవాల్సిందేనని విమర్శించారు. నియోజకవర్గంలో ఉన్న గ్రానైట్ క్వారీల యజమానుల నుంచి ప్రతి నెలా కోటి రూపాయలు మంత్రికి ముడుపులు రూపంలో సమర్పించుకోవాల్సిందేనని లోకేశ్ ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఇతర శాఖల మంత్రులతో మాట్లాడి నియోజకవర్గంతోపాటు జిల్లాను కూడా ఎంతో అభివృద్ధి చేయవచ్చని, కానీ అవినీతి పనులకు తప్ప, అభివృద్ధి పనుల కోసం ఫోన్లు చేయరని విమర్శించారు.

తెలుగుదేశం హయాంలో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యే లేకపోయినప్పటికీ మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి కోట్లాది రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. ఎన్నికల అనంతరం టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, నియోజకవర్గంలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేయించే బాధ్యతను తాను తీసుకుంటానని లోకేశ్ స్పష్టం చేశారు. తాచేరు, ఉరకగెడ్డ ప్రాజెక్టులు, కలిగొట్ల, దేవరాపల్లి వంతెనల నిర్మాణ పనులను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. మాడుగుల డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు సమకూరుస్తానని భరోసా ఇచ్చారు. ఈ సభలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాడుగుల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను దోచుకుంటున్న వైసీపీ నేతలు

... 5వ పేజీ తరువాయి

ఉక్కు ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. గత ఎన్నికల ముందు ఉమ్మడి విశాఖ జిల్లాలో పాదయాత్ర చేసిన సందర్భంగా జగన్ 50కిపైగా హామీలు ఇచ్చారని, సీఎం అయిన తరువాత వాటి అమలును మరిచి పోయారని విమర్శించారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు కాలేదని, విశాఖ మెట్రో ప్రాజెక్టు పనులు మొదలు పెట్టలేదని, మూడు సహకార షుగర్ ఫ్యాక్టరీలను మూసి వేయించారని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఎనిమిది లక్షల ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పి ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని లోకేశ్ చెప్పారు. జిల్లాకు పరిశ్రమలు తెస్తామని వైసీపీ పాలకులు చెప్పగా, కోడిగుడ్డు మంత్రి దెబ్బకు ఉన్న పరిశ్రమలు పారిపోతున్నాయని దుయ్యబట్టారు.

అయ్యన్నను చూస్తే వైసీపీకి వణుకు

"నర్సీపట్నం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఇక్కడో పులి ఉంది. ఆయనే అయ్యన్నపాత్రుడు. వైసీపీ ప్రజావ్యతిరేక పాలనపై పోరాడుతున్న ఆయనపై గత ఐదేళ్లలో 17 అక్రమ కేసులు పెట్టారు. వాటిలో అత్యాచారయత్నం కేసు కూడా ఉండడం దారుణం. అయ్యన్నను చూస్తే వైసీపీ ప్రభుత్వానికి వణుకు పుడుతున్నది" అని లోకేశ్ అన్నారు. అయ్యన్నపాత్రుడు ఇద్దరు కుమారులపైనా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో నర్సీపట్నం నియోజకవర్గంలో రెండు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. 2019లో తెలిసో తెలియకో పని చేసే నాయకుడిని కాదని, గణేశుడిని గెలిపించారని, దేవుడు పేరు పెట్టుకొని చెడ్డ పనులు చేస్తున్నారని విమర్శించారు. ఇసుక, లేటరేట్ మైనింగ్ ద్వారా స్థానిక ఎమ్మెల్యే ఐదేళ్లలో రూ.150 కోట్లు దోచేశారని ఆరోపించారు. పేద ప్రజలకు ఇచ్చిన భూములను తక్కువ ధరకు కొని, ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్న ఘనుడని విమర్శించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మాస్కు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడిని చేసి చంపారని ఆరోపించారు.

నర్సీపట్నం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాబోతున్నదని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని లోకేశ్ చెప్పారు. నర్సీపట్నంలో టిడ్కో ఇళ్లను వంద రోజుల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. నర్సీపట్నంలో మినీ ఐటీడీఏ, గిరిజన భవన్ ఏర్పాటుకు కృషి చేస్తామని, తాండవ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. మాడుగుల నుంచి 35 కిలోమీటర్ల దూరంలో వున్న నర్సీపట్నం రావడానికి రెండు గంటల సమయం పట్టిందంటే రోడ్డు ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చని లోకేశ్ అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లను అభివృద్ధి చేస్తామని, వరహా నదిపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నర్సీపట్నం జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పేట టీడీపీకి కంచుకోట

... 5వ పేజీ తరువాయి

ఆయనకు తెలియదు అని వైసీపీ సమన్వయకర్త కంబాల జోగులును ఉద్దేశించి అన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎమ్మెల్యేగా వున్న వ్యక్తి నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయించలేకపోయారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో టీటీడీ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించి ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశామని లోకేశ్ చెప్పారు. వైసీపీ వచ్చిన తరువాత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదన్నారు. ఉద్దండపురం మెగా వాటర్ ప్రాజెక్టును ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. పందూరు, జల్లూరు వంతెన నిర్మాణ పనులు టీడీపీ హయాంలో మొదలుపెట్టగా, వైసీసీ ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. మత్స్యకారుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన ఈ సభలో నియోజకవర్గం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, నియోజకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు, నాయకులు జానకి శ్రీనివాసరావు, పెట్ల లింగంనాయుడు, కొప్పిశెట్టి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గిరిజనులకు ఉజ్వల భవిత

- పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర



పెదబూరుగులులో టీడీపీలో చేరిక కార్యకర్తలకు కండవాలు వేస్తున్న దొన్నుదొర

హుకుంపేట, ఫిబ్రవరి 20: టీడీపీ ప్రభుత్వంలోనే గిరిజనులకు ఉజ్వల భవిత ఉంటుందని పార్టీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలో మత్స్యపురం పంచాయతీలోని పెదబూరుగులు గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పార్టీలో చేరిన 80 కుటుంబాల వారికి దొన్నుదొర కండువాలు వేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు ఎన్నో పథకాలను అందించినట్టు చెప్పారు. గిరిజనులకు బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా కార్పొరేట్ విద్యను చంద్రబాబు ఉచితంగా అందించారని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని రద్దు చేసిందన్నారు. దీంతో అధిక ఫీజులు చెల్లించలేక గిరిజన చిన్నారులు కార్పొరేట్ విద్యకు దూరమయ్యారని వాపోయారు. గిరిజన పిల్లలు, యువత భవిష్యత్ బాగుపడాలంటే టీడీపీ/జనసేన ప్రభుత్వం రావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్యామ్, శంకర్, లక్ష్మణ్, పండన్న, సంతోష్, బి.రమణ, సత్యనారయణ, అధిక సంఖ్యలో కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

పాడేరు రూరల్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలన్న లక్ష్యంతో ప్రతీ కార్యకర్త పనిచేయాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు కిల్లు వెంకట రమేష్‌నాయుడు కోరారు. మండలంలోని మారుమూల సలుగు, ఐనాడ పంచాయతీల పరిధిలోని లోలంగిపాడు, అలుగూరు, చీమలాపల్లి గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాలుగున్నరేళ్లలో చేపట్టిన అరాచక పాలనను ప్రజలకు వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధే జరగలేదని, దోచుకోవడం.. దాచుకోవడం తప్ప చేసిందేమీ లేదని రమేష్‌నాయుడు పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సూపర్-6 పథకాలను అమలు చేయడం ద్వారా ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని చంద్రబాబు చూపిస్తారన్నారు. కాగా, వైసీపీకి చెందిన 50 కుటుంబాల సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకోగా, వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు ఉల్లి రామారావు, ఎం.వెంకటేశ్వరరావు, బి.బాలరాజు, ఎస్.బొంజుపడాల్, జి.నవరాజు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్చెంనాయుడు దృష్టికి ఏజెన్సీ సమస్యలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 20: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు దృష్టికి ఏజెన్సీ సమస్యలను తీసుకువెళ్లినట్టు స్థానిక నాయకులు కొట్టగుల్లి సుబ్బారావు, వర్తన పిన్నయ్యదొర, రామకృష్ణ తెలిపారు. టెక్కలి నియోజకవర్గంలో మంగళవారం అచ్చెంనాయుడును మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించామన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్-6 పథకాలు అమలుతో పాటు గిరిజన యువత సంక్షేమానికి ప్రత్యేక సదుపాయాలను కల్పించేందుకు చంద్రబాబు చర్యలు చేపడతారని ఈ సందర్భంగా అచ్చెంనాయుడు చెప్పారన్నారు.



కలెక్టర్ విజయసునీతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మూర్తి దంపతులు.. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నరసింగరావు దంపతులు.. మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

కలెక్టర్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

పాడేరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ విజయసునీతను జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి.నరసింగరావు దంపతులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

అలాగే టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నూతన కలెక్టర్ విజయసునీతను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిపించేందుకు కృషి చేయాలని కోరారు.

జనాన్ని తెండి...

... 5వ పేజీ తరువాయి

నుంచి నేరుగా చినముషిడివాడలోని పీఠానికి వెళతారు. గంట సేపు అక్కడ ఉండి పూజలు చేస్తారు. 12.40 గంటలకు బయలుదేరి 12.55 గంటలకు విమానాశ్రయం చేరుకొని విజయవాడకు వెళతారు. విమానాశ్రయం నుంచి 15 నిమిషాలు ప్రయాణిస్తే పీఠం వస్తుంది. అయితే ఈ మార్గంలో 24 పాయింట్లు గుర్తించి, అక్కడ జనాలను ఉంచాలని జీవీఎంసీ అధికారులకు పైనుంచి ఆదేశాలు వచ్చాయి. ఒక్కో పాయింట్ వద్ద 500 మందికి తక్కువ లేకుండా చూడాలని సూచించారు. డ్వాక్రా గ్రూపు మహిళలను తరలించే బాధ్యతలను రీసోర్స్ పర్సన్లకు, పెన్షనర్లను తీసుకువచ్చే బాధ్యతను వలంటీర్లకు అప్పగించారు. వీరిని సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతం చేసే బాధ్యత పీడీలు, ఏపీడీలకు కట్టబెట్టారు. జోనల్ కమిషనర్లు పైనుంచి అన్నీ చూసుకోవాలని సూచించారు. విమానాశ్రయంలో టోల్‌ప్లాజా మొదలుకొని విమాననగర్ బస్టాప్, ఈటర్స్ స్టాపు, దుర్గానగర్ బస్టాప్, బిగ్ న్యూ మొబైల్ షాపు, విజేత సూపర్ మార్కెట్, రిలయన్స్ డిజిటల్స్, లక్ష్మీ షాపింగ్‌మాల్, సీఎంఆర్ షాపింగ్ మాల్, సింహాచలం పెట్రోల్ బంకు, గోపాలపట్నంలో బెహరా ఆస్పత్రి, భారతి కల్యాణ మండపం, వేపగుంట జంక్షన్, జోన్-8 కార్యాలయం...ఇలా చినముషిడివాడ జంక్షన్ వరకు 24 పాయింట్లు గుర్తించారు. పాయింట్‌కు 500 మంది చొప్పున మొత్తం పది వేల మందికి తక్కువ లేకుండా జనాలను తేవాలని ఆదేశాలు అందాయి. విమానాశ్రయం నుంచి ఎక్కడా ఆగకుండా కాన్వాయ్‌లో వెళ్లిపోయేటపుడు ఈ జంక్షన్ల వద్ద జనాలు ఎందుకో అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కల్యాణమస్తులో 83 జంటలకు రూ.78.75 లక్షలు



నమూనా చెక్కు ప్రదర్శిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పాడేరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్యాణమస్తు పథకంలో 83 జంటలకు రూ.78.75 లక్షలు అందించారు. సీఎం జగన్ మంగళవారం కల్యాణ మస్తు పథకం లబ్ధిదారులకు బటన్ నొక్కి సొమ్ము జమ చేస్తున్న సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ విజయసునీత మాట్లాడారు. పేదల జంటలకు ఆర్థిక సహాయం చేయాలనే లక్ష్యంతోనే కల్యాణమస్తు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదని, ఆ లబ్దిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 20 జంటలకు రూ.18 లక్షల 85 వేలు, అరకులోయ నియోజకవర్గంలో 32 జంటలకు రూ. 32 లక్షల 50వేలు, రంపచోడవరం నియోజకవర్గంలో 31 జంటలకు రూ.27 లక్షల 40 వేలు వారి ఖాతాల్లో జమయ్యాయన్నారు. బాల్య వివాహాలను నియంత్రించడంతో పాటు పేద జంటలను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఈ సాయం చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీతో కలిసి లబ్ధిదారులకు నమూనా చెక్కు అందించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ జి.జనార్ధనరావు, కల్యాణమస్తు జిల్లా సమన్వయకర్త ఎస్.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

గిరిజన బాలలకు సేవ చేసే తీరు ఇదేనా?

... 5వ పేజీ తరువాయి

వైద్యులతో ప్రధానోపాధ్యాయులు సమన్వయంగా ఉండాలని, రెండు రోజులు జ్వరంతో విద్యార్థి బాధపడితే వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై సరైన సమాధానాలు చెప్పలేదని కొయ్యూరు బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.దేవమూర్తి, హుకుంపేట బాలుర ఆశ్రమ పాఠశాల బాలురు-2 ప్రధానోపాధ్యాయుడు శోభా నాగభూషణంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని టీడబ్ల్యూ డీడీని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలకు సంబంధిత ప్రధానోపాధ్యాయుడే నోడల్ అధికారిగా వ్యవహరించాలని ఐటీడీఏ పీవో ఆదేశించారు. అలాగే హెల్త్ కాల్ సెంటర్‌ను (నంబర్: 1800 4250 0004) సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉపసంచాలకుడు ఐ.కొండలరావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్‌బాషా, సహాయ గిరిజన సంక్షేమశాఖాధికారులు ఎల్.రజని, మల్లికార్జునరావు, కె.వెంకటరమణ, క్రాంతికుమార్, ఏజెన్సీ 11 మండలాల ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, డిప్యూటీ వార్డెన్లు పాల్గొన్నారు.

ఏవోబీలో మావోయిస్టుల కదలికలు

... 5వ పేజీ తరువాయి

వరకు గతంలో డీసీఎంగా పనిచేసి ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న కాకురు పండన్న అలియాస్ జగన్‌తో పాటు మరో ముగ్గురు మావోయిస్టులు మండలంలో బూదరాళ్ల పంచాయతీ అన్నవరం సమీప వీరవరంతో పాటు ధారకొండ, గుమ్మిరేవుల, పలకజీడి, మండపల్లి, జెర్రిగొంది, మర్రిపాకలు, గుర్తేడు తదితర గ్రామాలను సందర్శించినట్టు పోలీసులకు సమాచారం అందింది. గతంలో మాదిరిగానే ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని ఈ సమావేశాల్లో జగన్ కోరినట్టు పోలీసులకు సమాచారం అందింది. గత వారం రోజుల వ్యవధిలో జగన్ మళ్లీ పలు గ్రామాలను సందర్శించాడని పోలీసులు తెలుసుకున్నారు. జగన్ తన స్వగ్రామమైన నిమ్మచెట్టు వెళ్లి అక్కడ నుంచి గాలికొండ మండపల్లి, పెదలంక, మర్రిపాకలు గ్రామాల్లో పర్యటించి పార్టీ కార్యకలాపాలను విస్తృత పరిచేందుకు సహకరించాలని అక్కడి వారిని కోరినట్టు తెలిసింది.

పోలీసులు అప్రమత్తం

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో మావోయిస్టులు సానుభూతిని కూడకట్టుకునే ప్రయత్నం ముమ్మరం చేసిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో జగన్ ఏ ప్రాంతాలను సందర్శించాడు?, ఎవరిని కలిశాడు?, ఏం మాట్లాడాడు? అన్న వివరాలను పోలీసులు రాబట్టారు. అప్పట్లో జగన్‌ను కలిసిన వ్యక్తులను గుర్తించడంతో పాటు వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

సంక్షిప్తంగా..

బాబు పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు
టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్టిబాబు

జి.మాడుగుల, ఫిబ్రవరి 20: చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాయయంలో పార్టీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ముఖ్యంగా ఏజెన్సీలో గిరిజన విద్యార్థులు మరణాల సంఖ్య అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నిరంకుశ పాలనపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎల్.రామకృష్ణ, పి.భీంబాబు, ఎం.లక్ష్మయ్య, కె.పిన్నయ్య, కె.లక్ష్మణ్‌రావు, పి.క్రిష్ణమూర్తి, వి.క్రిష్ణమూర్తి, సత్తిబాబు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 20: గిరిజనుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కె.బలరాం అన్నారు. జోలాపుట్టు పంచాయతీలోని బోండ్రు గూడ గ్రామంలో మంగళవారం బాబు షూరిటీ.. భవిష్యతు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అర్హులకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించడంలో విఫలమైందన్నారు. నిత్యావసర సరకుల ధరలకు రెక్కలు వచ్చాయని, సామాన్యుడు జీవించలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందుతాయని, నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.శివశంకర్, నాయకులు వి.రామస్వామి, బాబూజీ, కె.జగత్‌రాయ్, మజ్జి చిన్ని, రామారావు, గురుమూర్తి, మల్లేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాల నమోదు తప్పనిసరి

కొయ్యూరు, ఫిబ్రవరి 20: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సీడీపీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని మర్రిపాలెం, గోపవరం నిమ్మలపాలెం, రొబ్బసింగి, తదితర అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేసే చర్యలు చేపట్టించారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి సరిపడా నిధులు జనరేట్ అయ్యేందుకు వీలుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతా, ఆధార్ తదితర వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆమె తెలిపారు. సీడీపీవో వెంట సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

డుంబ్రిగుడలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని అల్లూరి జిల్లా లీడ్ మేనేజర్ (ఎల్‌డీఎం) రవితేజ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజేష్‌తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా బ్యాంకు అందించే సేవింగ్, రుణ, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు బ్యాంకింగ్ పట్ల అవగాహన కల్పించేం దుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఖాతాదారులు ఓటీపీలు, పిన్ నంబర్లను గోప్యత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ అశోక్, జిల్లా కోఆర్డినేటర్ హరి, ఎస్ఎల్ కౌన్సిలర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అరకులో 114 మందికి నేత్ర పరీక్షలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 20: మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలో మంగళవారం ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఎల్‌వీ కంటి ఆసుపత్రి సిబ్బంది 114 మందికి కంటి పరీక్షలను చేశారు. వీరిలో 18 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అలాగే గతంలో కంటి పరీక్షలు చేయించుకున్న గిరిజనులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ శారద మాట్లాడుతూ విశాఖపట్నం ఎల్‌వీ కంటి ఆసుపత్రి యాజమాన్యం గిరిజన ప్రాంతంలో కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకృష్ణ, టెక్నీషియన్లు సత్యనారాయణ, సాయికుమార్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చింతపల్లి, ఫిబ్రవరి 20: మండలంలోని చింతపల్లి-నర్సీపట్నం ప్రధాన రహదారి పెద్దగెడ్డ మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. దీనికి సం బంధించి వివరాలిలా ఉన్నాయి. గూడెంకొత్తవీధి మండలం రామగెడ్డ గ్రామానికి చెందిన వనపల రాకేశ్, రింతాడకు చెందిన సాకేరి ప్రసాద్ ద్విచక్రవాహనంపై మంగళవారం సాయంత్రం నర్సీపట్నం బయలుదేరారు. పెద్దగెడ్డ మలుపు వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బ్రేక్ వేయడంతో అదుపు తప్పి పడిపోయారు. ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'జగన్ ఆశయ సారథులు వలంటీర్లు'

పాడేరు రూరల్, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో సీఎం జగన్ ఆశయ సారథులు వలంటీర్లని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు మంగళవారం అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వలంటీర్లపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.రాంబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వి.బసవన్నదొర పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు తప్పవు

కొయ్యూరు, ఫిబ్రవరి 20: చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే చర్యలు తప్పవని కొయ్యూరు సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ హెచ్చరించారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలు మఠంభీమవరం, యు.చీడిపాలెం పంచాయతీల్లోని రేవులకోట, పెదలంక కొత్తూరు, ఎండకోట, గొందికోట, మఠంభీవరం గ్రామాలను సిబ్బందితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రేవులకోట, పీఎల్ కొత్తూరు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.